పత్తాలేని కమీషన్ మర్చంట్

- పునఃప్రారంభానికి నోచుకోక రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, సబ్ మార్కెట్ పాలకులు
- ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పంటల ఉత్పత్తులు


అయిజలో నేలమట్టమైన కమీషన్ మర్చంట్ భవనాల సముదాయం

అయిజ: రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు మార్కెట్ యార్డ్‌ల్లో కమీషన్ మార్చంట్లు ఏర్పాటు చేయించి, రైతుల పంటలను కొనుగోలు దారులతో కొనుగోలు చేయించాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెటింగ్ అధికారులదే. అయితే అలంపూర్ నియోజకవర్గంలో ఒక్క కమీషన్ మర్చంట్ కూడా నిర్వహించడంలేదు. అయిజ వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డులో 1993లో కమీషన్ మర్చంట్ ఏర్పాటు చేశారు. కమీషన్ మర్చంట్ నిర్వహణకు అధికారులు మౌలిక వసతులు కల్పించకపోడంతో అప్పట్లో అటు వ్యాపారులు, ఇటు రైతులకు ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దాంతో అయిజ మార్కెట్ సబ్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కమీషన్ మర్చంట్‌కు రైతన్నలు ధాన్యాన్ని తీసుకెళ్లడం క్రమేనా తగ్గించారు. ఆదాయం తక్కువగా ఉందని అధికారులు కమీషన్ మర్చంట్ నిర్వహణను గాలికొదిలేశారు. ఎలాగోలా 2000సంవత్సరం వరకు కమీషన్ మర్చంట్ వ్యాపారులు కొనుగోళ్లను కొనసాగించారు. అనంతరం కమీషన్ మర్చంట్ వ్యాపారులకు ఇబ్బందులు ఎక్కువవడంతో వారుకూడా చేతులెత్తేశారు. అప్పటినుంచి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. నిర్వహణ లేకపోవడంతో కమీషన్ మర్చంట్ భవన సముదాయాలు శిథిలమైపోయాయి.

వివిధ రకాల పంటల సాగు..

రైతులు వానకాలంలో వరి, పత్తి, మిరప, ఆముదం, కంది పంటలు సాగుచేస్తారు. అదేవిధంగా యాసంగి పంటల్లో భాగంగా పప్పుశనుగ, వాము, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తారు. అయిజ వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్ లేకపోవడంతో పండించిన పంటలను అమ్ముకోవడానికి అన్నదాతలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూరు, గద్వాల జిల్లా కేంద్రానికి ధాన్యాన్ని, పత్తి, మిరుప, వాము తదితర పంటలను తరలించడానికి అన్నదాతలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అయిజ మార్కెట్ సబ్‌యార్డ్‌లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి, కందులు, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేస్తుండడంతో రైతులు కొంతమేర ఊపిరిపీల్చుకున్నారు. అయితే కొనుగోలు కేంద్రాన్ని స్వల్ప కాలం మాత్రమే నిర్వహిస్తుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఖరీఫ్‌లో పండించే వేరుశనగ, ఆముదాలు, పత్తి, మిరుప తదితర పంటన్నింటినీ కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రైతుల అవస్థలు



అలంపూర్ నియోజకవర్గంలో కమీషన్ మర్చంట్ లేకపోవడంతో రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. ధాన్యం, పత్తి, మిరుప తది తర పంట ఉత్పత్తులను ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కమీషన్ మర్చంట్‌లకు తరలించేందుకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌ల్లో కమీషన్ మర్చంట్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు బాగుంటుంది.

– నర్సింహులు, రైతు, కిష్టాపురం

వ్యాపారులు వస్తే ఏర్పాటు చేస్తాం



కమీషన్ మర్చంట్‌ను పునఃప్రారంభించాలంటే వ్యాపారులు ముందుకు రావాలి. అయిజలో గతంలో కమీషన్ మర్చంట్ నిర్వహించారు. అనేక కారణాల వల్ల అది విఫలమైంది. మళ్లీ పునఃప్రారంభించేందుకు అవకాశముంది. దానికోసం కమీషన్ మర్చంట్ వ్యాపారం చేసేవారు లైసెన్సు తీసుకోవాలి. కమీషన్ మర్చంట్ నిర్వహించేందుకు వ్యాపారులు ముందుకొస్తే వారికి ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తాం.

– పుష్పమ్మ, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్

అనేక ఇబ్బందులు



కమీషన్ మర్చంట్‌లు లేకపోవడంతో రైతులం అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. పండించిన ధాన్యం అమ్ముకోవడానికి గద్వాల, రాయిచూర్‌కు తీసుకపోవాల్సి వస్తుంది. దానికోసం రైతులు అదనంగా ఖర్చుచేయా ల్సి వస్తుంది. సమయం వృథా అవుతుంది. ప్రభుత్వం కమీషన్ మర్చంట్ ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– వెంకట్రాములు, రైతు, తూంకుంట

రైతులను దోచుకుంటున్నారు



మార్కెట్ సబ్‌యార్డ్‌ల్లో కమీషన్ మర్చంట్ లేక పోవడంతో దళారులు రైతులను దోచుకుంటున్నారు. గత్యంతరం లేక దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నాం. ఇదే అవకాశంగా చేసుకొని కొంతమంది దళారులు రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, అలంపూర్ మార్కెట్ యార్డుల్లో కమీషన్ మర్చంట్ ఏర్పాటు చేయాలి.

– ఈరన్న, రైతు, సింధనూరు

ప్రతిభకనబర్చిన విద్యార్థులకు సన్మానం



అమరచింత: జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ ఫలితాల్లో ఎస్సీ క్యాటగిరిలో ఆలిండియా స్థాయిలో 412వ ర్యాంక్‌ను సాధించిన సంపత్‌కుమార్, ఎస్ఎస్‌సీలో 555 మార్కులు సాధించిన విద్యార్థి సమతను కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన బాలరాజ్, లతల కుమారుడు సంపత్ కుమార్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యాంసుందర్, రాజు, అజయ్, అరుణ్, భిక్షరాజు, బాలరాజ్, లత పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు!



వనపర్తి రూరల్: వనపర్తి నుంచి పెబ్బేరుకు వెళ్లే ప్రధాన రహదారిపై తిరుమల్లయ్యగుట్ట సమీపంలో సుమారు నెల క్రితం రోడ్డు సైడ్ గుంత ను తవ్వి వదిలేశారు. రోడ్డు వెంబడి ఇంటర్ నెట్‌కేబుల్ కోసం గుంతను తవ్వి వదిలేయడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఓ పక్క మలుపు, సింగిల్ రోడ్డు కావడంతో రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనాలు ఎదురైతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

శిథిలావస్థకు పశువైద్య కేంద్రం



మల్దకల్ : మండలంలోని బిజ్వారం పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకున్నది. 23ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం పైపెచ్చులూడి కడ్డీలు తేలి ఎప్పుడు కూలి ఏం ప్రమాదం జరుగుతుందోనని పశువైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పశువైద్య కేంద్రం పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉండడంతో మూగజీవాలకు వైద్యం చేయించేందుకు రైతులు అయిష్టత కనబరుస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తిమ్మప్ప, మల్దకల్, సత్యన్న ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య కేంద్రాన్ని తొలగించి నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, పశువైద్యసిబ్బంది కోరుతున్నారు.

కూలీలను తరలిస్తున్న వాహనదారులపై ఫిర్యాదు

గట్టు : మండలంలోని అరగిద్ద నుంచి కిషోర బాలికలను కూలీ పనులకు ఇతర గ్రామాలకు తరలిస్తున్న వాహనదారులపై వీవోఏగా పనిచేస్తున్న మునేశ్వరి ఆదివారం గట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మునేశ్వరి కిషోర బాలికలను తరలిస్తున్న వాహనదారులతో పాటు బాలికల తల్లిదండ్రులను కలిసి బాలికలను కూలీ పనులకు తరలించొద్దని వారించింది. దీంతో వాహనదారులతో కొంత మంది తల్లిదండ్రులు మునేశ్వరితో దుర్భాషలాడి చేయి చేసుకున్నారు. ఈ వ్యవహారంపై మునేశ్వరి గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

డబుల్ బీటీ రోడ్డు నిర్మించండి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి బీటీ రోడ్డుగా మార్చాలని ఎన్నో రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వీపనగండ్ల, కల్వరాల్ల, కేతేపల్లి గ్రామాల వరకు 10 కి.మీ.ల బీటీ రోడ్డును డబుల్ బీటీ రోడ్డుగా నిర్మిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, చిన్నంబావి మండల ప్రజలు జిల్లా కేంద్రానికి ఈ రహదారి గుండా వెళ్లితే దాదాపు 10 కి.మీ.లు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డబుల్ బీటీ రోడ్డును నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు



అమరచింత: మండలంలోని కొంకన్వానిపల్లె గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయని, దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయేనని గ్రామ సీపీఐ నాయకులు తెలిపారు. వేలాడుతున్న విద్యుత్ తీగల విషయాన్ని ఎన్నోసార్లు ట్రాన్స్‌కో ఏఈకి విన్నవించినా ఫలితం లేదన్నారు. లైన్‌మెన్‌కు ప్రతి రోజు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలు వేలాడుతుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడామన్నారు. కార్యక్రమంలో అంజి, శ్రీను, చిన్నరాజు, కుతుబ్ ఉన్నారు.

ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

గోపాల్‌పేట: ప్రజా పోరాటాలతోనే ప్రజల సమ స్యలు పరిష్కారం అవుతాయని, అందుకు అంతా సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. ఆదివారం మండలంలోని పొలికెపాడు గ్రామంలో చంద్రయ్య ఆధ్వర్యంలో గ్రామ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలు లేకుండా ప్రజల సమస్యలు తీరవని అన్నారు. భారత దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కమ్యూనిస్టులు ఎన్నో ఏండ్లు పోరాడారని గుర్తు చేశారు. పేదలకు బంజరు భూముల పంపిణీ, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, రైతు రుణమాఫీ, ఉచిత కరెంటు, రైతులకు గిట్టుబాటు ధర, రేషన్‌కార్డులు, ఇతర పేదల సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడితేనే పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రమేష్, మాజీ కార్యదర్శి శాంతన్న, గ్రామ కార్యదర్శి బుచ్చన్న పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

అయిజ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వడ్లు తరలించి తెలంగాణలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో విక్రయించిన అవినీతిపరులు, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పులికల్‌లో ఏర్పాటు చేసిన బైనిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ నుంచి వడ్లను తరలించి విక్రయించారని పేర్కొన్నారు. విక్రయించిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కలెక్టర్‌కు సైతం అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు అవినీతిపరులపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై అదేవిధంగా సెంటర్ సీసీపై చర్యలు తీసుకోవాలని, విచారణలో తేలినా దాన్ని కప్పిపెట్టిన అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పల్లయ్య డిమాండ్ చేశారు. అవినీతిపరులపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేశ్, రామాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణం



ఇటిక్యాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఇందిరమ్మ ఇంటి మోడల్ భవనం నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు చూపించేందుకు మోడల్ భవనం నిర్మించినట్లు ఎంపీడీవో అజార్ మొహినుద్దీన్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున విడతల వారీగా మంజూరవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి ఇటిక్యాల మండలంలో బట్లదిన్నె, గోపల్‌దిన్నెలో మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

తిరంగా యాత్రను జయప్రదం చేద్దాం

అమరచింత: ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా అమరచింత పట్టణంలో సోమవారం తిరంగాయాత్ర నిర్వహిస్తున్నామని యాత్రలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొనాలని బీజేవైఎం రాష్ట్ర కో కన్వీనర్ మంత్రి సుధీర్, బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లె, కొంకన్వానిపల్లె గ్రామాలతో పాటు ఆయా గ్రామాలతో మండల కేంద్రంలో జరిగే కార్యక్రమం విజయవంతం చేయాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. తిరంగ్ యాత్రలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలపై ఇంటింటి ప్రచారం


పల్లెపాడులో బాడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంఈవో శివప్రసాద్


పారుచర్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధరూరు: మండలంలోని పారుచర్లలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలపై ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై వివరించారు. బాగా చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో ముద్రించిన కరపత్రాలను పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, రాజశేఖర్‌గౌడ్, సీఆర్‌పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు మండలంలో..

మానవపాడు: మండలంలోని పల్లెపాడులో ఎంఈవో శివప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలనే లక్ష్యంగా బాడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం


ప్రతిభాపురస్కారాల అందుకున్న విద్యార్థులతో వాల్మీకి సంఘం నాయకులు

గద్వాలటౌన్ : పోటీ ప్రపంచంలో విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే మరింత ముందుకెళ్తారని జిల్లా వాల్మీకి సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. వాల్మీకి బోయ ఉద్యోగుల జిల్లా సంఘం, వాల్మీకి బోయ సేవా జిల్లా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వాల్మీకి బోయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఆదివారం స్థానిక వాల్మీకి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి చదువులో అత్యంత ప్రతిభ అవసరమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఇప్పటినుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో సాధించాలన్నారు. పేద విద్యార్థులకు సంఘం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మధుసూదన్‌బాబు, రామాంజనేయులు, శ్యామల, శివారెడ్డి, కృష్ణయ్య, ఆంజనేయులు, ఎల్లాస్వామి, సాలప్ప తదతరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంబరాలు


గట్టులో బాణాసంచా కాలుస్తున్న మత్స్యకార సంఘం నేతలు


ధరూరులో సంబరాలు చేసుకుంటున్న ముదిరాజ్ సంఘం నాయకులు

గట్టు : ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో చోటు దక్కడంతో గట్టుకు చెందిన మత్స్యకార సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం గట్టు బస్టాండ్ ఆవరణలో మత్స్యకార సంఘం నేతలు బాణాసంచా కాలుస్తూ సంబరాలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, కా ర్యదర్శి . నాగరాజు, ఉపాధ్యక్షుడు చిన్న నర్సింహులు, శంకరయ్య, సంఘం సభ్యులు ఆంజనేయులు, తిమ్మప్ప, నాగప్ప, గోపి, ఈరన్న, వెంకటేశ్, ఈరన్న, తిమ్మప్ప, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరూరు : మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కడంతో ముదిరాజ్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జై కాంగ్రెస్, జైజై రేవంత్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో చాపల జమ్మన్న, వీరన్న, ఎల్లప్ప, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయండి



అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరి గతంలో ఇచ్చిన హామీ అమలు కాలేదని, ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి శ్రీహరి ఇక్కడి విద్యార్థుల బాధలు తెలుసుకుని కాలేజీ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వినయ్, రమేష్, రాము, వెంకటేష్ ఉన్నారు.

రైతులపై టార్పాలిన్ల భారం

- ఐదేళ్లుగా పంపిణీ చేయని ప్రభుత్వం
- అకాల వర్షాలకు తడుస్తున్న పంట దిగుబడులు
- అధిక ధరలకు కొనుగోలు చేయలేక రైతుల అవస్థలు


మానవపాడులో తడిసిన మిర్చి పంటను చూపుతున్న రైతు

మానవపాడు: అకాలవర్షాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంట పండించిన రైతులు చేతికొచ్చే సమయంలో అకాల వర్షంలతో ధాన్యం, పండించిన పంటను కాపాడుకోలేక అవస్థలు పడుతున్నారు. పంటలు తడిసిపోకుండా రక్షణగా కప్పి ఉంచేందుకు టార్పాలిన్ కవర్లను వినియోగిస్తుంటారు. గతంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై వ్యవసాయశాఖ ద్వారా టార్పాలిన్ కవర్లను పంపిణీ చేసేది. అకాల వర్షాలకు పంటలు తడిసిపోకుండా రాయితీపై అందించే టార్పాలిన్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఐదేళ్లుగా రాయితీపై అందించే టార్పాలిన్లను పంపిణీ చేయడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. గతంలో రైతులు రాయితీపై తీసుకున్న టార్పాలిన్లు శిథిలావస్థకు చేరాయి.

తడిసిపోతున్న పంటలు

అలంపూర్ నియోజకవర్గంలోని 124 పంచాయతీలు ఉండగా.. వాటిలో 8మండలాలు ఉన్నాయి. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా టార్పాలిన్ల సమస్యలతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుత కాలంలో ఎప్పుడు వర్షాలు కురుస్తాయో.. తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటలను సాగు చేస్తుంటారు. పంటలను చేతికొచ్చే సమాయానికి అకాల వర్షాలతో పంటను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయంగా టార్పాలిన్లు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. పంటల దిగుబడి వచ్చిన తర్వాత పంటలకు ఎక్కువగా సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడులు, పంట పెట్టుబడులు అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మొక్కజొన్న, జొన్న, కందులు, మిర్చి, పోగాకు తదితర పంటలను కాపాడుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తుగానే ఉన్నతాధికారులకు నివేదికలు పంపి.. టార్పాలిన్లను ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయాలని అలంపూర్ నియోజకవర్గ రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో.. అధిక ధరలకు ప్రైవేట్ వ్యాపారులతో అరకొరగా కొనుగోలు చేస్తున్నారు.

రైతులకు అదనపు భారం

గతంలో ప్రభుత్వం ఉధాన, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో టార్పాలిన్ కవర్లను రాయితీతో అందించేది. 250 జీఎస్ఎం(మందం) నాణ్యత, 8మీ టర్ల పొడవు, 6 మీటర్ల వెడల్పు కలిగిన టార్పాలిన్ కవరు ధర ప్రభుత్వం తరఫున రూ.2500 వరకు ఉండగా.. 50శాతం రాయితీపై రైతులకు రూ.1250 విక్రయించేది. చాలా ఏళ్ల క్రితం టార్పాలిన్లను ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయగా.. ఇంతవరకు ప్రభుత్వం తరఫున రాయితీ టార్పాలిన్లు రాలేదు. పంపిణీ నిలిపివేయడంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద టార్పాలిన్లును రూ. 3వేల నుంచి రూ.5వేల వరకు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం తరఫున అందించాలని కోరుతున్నారు.

రాయితీ అందేలా చూడాలి



రాయితీపై టార్పాలిన్ కవర్లు లేక అధిక ధరకు కవర్లను కొంటున్నాం. సబ్సిడీ టార్పాలిన్లను ప్రభుత్వం నిలిపివేసింది. కవర్లు అందుబాటులో లేక చేతికొచ్చిన పంటలు తడిసిపోతున్నాయి. టార్పాలిన్ కవర్లను అందించాలి. త్వరగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని కోరుతున్నాం.

– సంజీవనాయుడు, రైతు చెన్నిపాడు.

అధిక ధరలకు కొంటున్నాం



తెలంగాణ ప్రభుత్వం టార్పాలిన్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ వ్యక్తుల ద్వారా అధిక ధరలు రూ. 3వేల నుంచి రూ.5వేలకు కొనాల్సి వస్తోంది. అధిక ధరల తో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం తరఫున కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గోపాల్, రైతు గోకులపాడు.

ప్రభుత్వం తరఫున సరఫరా చేయడం లేదు

కొన్నేళ్లుగా ప్రభుత్వం తరఫున టార్పాలిన్లను సరఫరా చేయడం లేదు. టార్పాలిన్లను రైతులకు అందించేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదికలు పంపుతాం.

– ప్రదీప్, ఏఓ. మానవపాడు.